క్లుప్తంగా

మండెం లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె గ్రామంలో జల్లావాండ్లపల్లె సమీపంలో మాండవ్యానది ఒడ్డున వెలసిన మహిమాన్వితుడు మండెం లక్ష్మీ నరసింహస్వామికి కార్తీక మాసం శనివారం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. ప్రతి శనివారం ఇక్కడికి మండల వాసులే కాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. వారిచేత అర్చకులు ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహింపచేసి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ



నూతన రామాలయానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

సంబేపల్లి : మండలంలోని గురిగింజకుంట గ్రామం దళితవాడలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి శనివారం ఎంపీటీసీ శ్రీధర్ రెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ అమరనాథరెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీటీడీ నిధులతో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి చొరవతో రూ.10 లక్షలతో నూతనంగా శ్రీ సీతారాముల ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోలింగ్ బూత్‌ను తనిఖీ చేస్తున్న తహశీల్దార్ సత్యానందం

నందలూరు(రాజంపేట) : మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ వైపి సత్యానందం అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అరవపల్లి 97 పోలింగ్ కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఓటర్లు ఉపయోగించుకోవాలన్నారు. శని, ఆది వారాలలో ఈ కేంద్రాలు పని చేస్తాయన్నారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ, డిప్యూటీ తహశీల్దార్ మోహన్, ఆర్ఐ సుశీల్ కుమార్, సర్వేయర్ ఓబయ్య, విఆర్ఓ రాజు, బూత్ లెవల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ పరిశీలన



ఆలయంలో వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి

నందలూరు(రాజంపేట) : ఉమ్మడి కడప జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా పేరుగాంచిన శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంపీపీ మేడా విజయ్‌భాస్కర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల కోసం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంతకుముందు ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నందలూరు ఎంపీటీసీ సోమిశెట్టి ప్రభాకర్, కాకి చంద్ర, బద్రి రెడ్డి పాల్గొన్నారు.

త్వరితగతిన పంట నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగరాజు

బద్వేలు(అట్లూరు) : పంట నమోదు కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని బద్వేలు వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) ఎం. నాగరాజు పేర్కొన్నారు. బద్వేలు డివిజన్ వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఆయన బద్వేలు, అట్లూరు, గోపవరం, సిద్దవటం మండల వ్యవసాయ అధికారులతో పాటు ఆయా మండలాల లోని రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను త్వరితగతిన ఈ పంట నమోదు కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. అలాగే రైతుల సాగు చేసిన పంటలకు అనుగుణంగా ఎరువులను రైతు భరోసా కేంద్రాలలో నిల్వలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. దీంతో పాటు పలు సూచనలు చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రాజంపేట డివిజన్‌లోని మండలాలపై తుపాన్ ప్రభావం
- ఏపీ వాతావరణశాఖ హెచ్చరిక
- ఆర్డీవో కంట్రోల్‌రూం ఏర్పాటు
- రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి



తుపాను నేపథ్యంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రామకృష్ణారెడ్డి

రాజంపేట : మిచాంగ్ తుపాను నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం తన చాంబరులో వివిధశాఖల అధికారులతో మిచాంగ్ అలెర్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట డివిజన్‌లోని అన్ని మండలాలపై మిచాంగ్ తుపాను ప్రభావం అధికంగా ఉంటుందని ఏపీ వాతావరణశాఖ హెచ్చరించిందన్నారు. అన్ని మండలాల్లోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా చూడాలన్నారు. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో కంట్రోల్‌రూంను ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూం నెంబరు 7093888991కు ప్రజలు అత్యవసర సమాచారాన్ని అందజేయవచ్చునన్నారు. సమాచారం వచ్చిన వెంటనే ఆయా ప్రాంతాల అధికారులను అప్రమత్తం చేస్తామన్నారు. అవసరమైతే పరిస్థితులను బట్టి సహాయక చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

ఓటర్ల సవరణ కేంద్రాలను తనిఖీ చేసిన ఆర్డీఓ

రాజంపేట మండలంలోని తాళ్లపాక, బోయనపల్లెలో ఏర్పాటుచేసిన ఓటర్ల సవరణ కేంద్రాలను ఆర్డీవో రామకృష్ణారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా విషయంలో ప్రజలు తమ ఓటు హక్కు పొందే విషయంలో ఏదైనా సమస్య ఉంటే పరిష్కరించేందుకు వీలుగా ఓటర్ల సవరణ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిందన్నారు. ఆదివారం కూడా ఓటర్ల సవరణ కేంద్రం సేవలను ఓటర్లు, వివిధ రాజకీయపార్టీ నాయకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓటర్ జాబితా పరిశీలన

రైల్వేకోడూరు : పట్టణంలోని జిల్లా బాలికోన్నత పాఠశాలలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ సీహెచ్ రమేష్ ఓటరు లిస్టును శనివారం పరిశీలించారు. ఓట్లు ఉన్నాయా లేవా అనే విషయం తెలుసుకున్నారు. బూత్ కన్వీనర్ బి నాగరాజు, వార్డు సభ్యులు ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

సిద్దవటం : టీబీ వ్యాధిగ్రస్తులకు కడపకు చెందిన పవర్ గ్రిడ్ సంస్థ వారు పౌష్టికాహారాన్ని అందజేశారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని ఆరోగ్య ఉప కేంద్రం వద్ద వీటిని అందజేశారు. జిల్లా కోఆర్డినేటర్ శివకుమార్, సూపర్‌వైజర్ రామ్మోహన్, ఎస్‌టిఎస్ సుబ్బరాయుడు, ఆశా వర్కర్‌లు విజయ భారతి, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని పీహెచ్‌సీలో శనివారం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో టీబీ వ్యాధి గ్రస్తులకు పౌష్టిక ఆహారాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ హిమ శ్వేత పంపిణీ చేశారు. జిల్లా టీబీ సమన్వయ కర్త గంటా శివశంకర్, ఎస్‌టీఎస్ సుబ్బరాయుడు, ఎస్‌టీఎస్ ప్రసన్న కుమార్, టీబీహెచ్‌యు శ్రీధర్, ఎంపీహెచ్‌ఎస్ మహబూబ్ భాషా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉజ్వల కనెక్షన్లు పేదలకు వరం

రామాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ఉచిత గ్యాస్ కనెక్షన్లు పేదలకు వరం లాంటిదని ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సివి సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని కల్పనాయునిచెరువు గ్రామ సచివాలయాల్లో శనివారం ఎంపీడీఓ హైదర్‌వలి ఆధ్వర్యంలో విక్షిత్ భారత సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విక్షిత్ భారత్‌సంకల్పయాత్రలో హెల్త్‌కార్డులను డా.వినోద్‌కుమార్ సివి సుబ్బారెడ్డితో కలిపి పంపిణీ చేశారు. సర్పంచులు వైష్ణవి, మండల ఉపాధ్యక్షురాలు నాగరాణిబాబు, వెంకటరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, కృష్ణయ్య, వైద్యాధికారి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

మామిడిపై అవగాహన

సిద్దవటం : మండలంలోని పొన్నవోలు రైతు భరోసా కేంద్రంలో శనివారం రైతులకు మామిడి పంటలపై తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని హార్టికల్చర్ అధికారి జయభరత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లతామర పురుగును మామిడి చెట్ల నుంచి నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రతలపై రైతులకు తెలియజేశామన్నారు. రైతులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు అరుణాచలానికి ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన తమిళనాడులోని అరుణాచలానికి ప్రత్యేక బస్సును నడపనున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు ఈ బస్సు కడప నుంచి బయలు దేరుతుందన్నారు. బస్సులో పెద్దలకు రూ. 1070, పిల్లలకు రూ. 570 ఛార్జిగా నిర్ణయించారన్నారు. ఆసక్తిగల వారు బస్టాండులోని రిజర్వేషన్ కౌంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఉర్దూ కవి సమ్మేళనం

కడప ఎడ్యుకేషన్ : అబ్దుల్ మజీద్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కడప ఐటీఐ వద్ద ఉన్న ఇక్బాల్ రైల్ మిల్లులో మగ్బుల్ మంజిల్‌లో ఉర్దూ కవి సమ్మేళనం, ఉత్తమ ఉర్దూ కవులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి మగ్బుల్ అహ్మద్ తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర, జాతీయస్థాయి అవార్డులు అందుకున్న ఉర్దూ ఉత్తమ కవులు డాక్టర్ సత్తార్ సాహెబ్, గౌస్‌ఖాన్ ఆరీఫ్, సత్తార్ ఫైజీలను సన్మానించనున్నారు. ఉర్దూ కవులు పాల్గొనాలని కన్వీనర్ కోరారు.

అభివృద్ధి పనుల వేగవంతం



నియోజవర్గం అభివృద్ధి పనులపై అధికారులతో మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం రైల్వేకోడూరు ఏంపీడీఓ కార్యలయంలో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ అధికారులతో అభివృద్ధి పనులపై నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రైల్వేకోడూరు నియోజవర్గం అంటే ప్రత్యేకమైన అభిమానం అని అందుకే నియోజవర్గం అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేశారని అన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎక్కడ రాజీపడే ప్రసక్తే లేదని అన్నారు. దాదాపు నలభైకోట్ల రూపాయలతో చిట్వేలి రైల్వేకోడూరు రోడ్డు విస్తరణ పనులు, సుమారు 5 కోట్ల రూపాయలతో నిర్మించే రైల్వే అప్రోచ్‌రోడ్డుకు సంబంధించిన పనులపై అధికారులతో సమీక్షంచారు. చిట్వేలి రైల్వేకోడూరు దారిలో అధికంగా మలుపులు ఉన్నాయని.. అనేక ప్రమాదాలు జరిగాయని రోడ్డు విస్తరణలో మలుపులు లేకుండా నిర్మాణం చేపట్టలని సూచించారు. భూసేకరణ సంబంధించిన పనులు త్వరితగతిన నిర్వహించి టెండర్ ప్రక్రియ చేపట్టి పనులు వేగంగా పూర్తి చేయాలని అన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జికి సంబంధించిన అప్రోచ్‌రోడ్డు పనులు వేగవంతం చేయాలని అన్నారు. నియోజకవర్గంలో గడప గడకు మన ప్రభుత్వంలో చేపట్టిన రోడ్డు పనులను, నిర్మాణ దశలో ఉన్న సచివాలయాల పనులు పరిశీలించి పూర్తి చేయాలని అన్నారు. నూతన జాతీయ రహదారి 716 పనుల గురించి అధికారులతో ఆరా తీశారు. భూసేకరణ పనులు తదితర అంశాల గురించి చర్చించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు పంజం సుకుమార్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ఆర్అండ్‌బీఈఈ సహదేవరెడ్డి, డీఈ జయప్రకాష్, పంచాయతీ రాజ్ ఈఈ రామచంద్రనాయక్ డీఈ బాలనరసింహులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఓబులవారిపల్లె : మిచాంగ్ తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజవర్గంలో తుపాను ప్రభావం మూడు రోజులు పాటు గాలులతో కూడిన భారీ వర్షం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. లోతట్టు ప్రాంతల్లో నివాసం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలు అవసరం ఉంటే తప్ప బయటికి రావద్దని అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటు ప్రజలకు అత్యవసర సమయంలో అందుబాటులో ఉండాలని సూచన చేశారు.

అర్హులందరికీ ఉపాధి పనులు



వీరబల్లిలో సామాజికతనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి

వీరబల్లి(రాజంపేట) : జాబ్‌కార్డు కలిగి ఉన్న అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని వీరబల్లి మండలాధ్యక్షుడు గాలివీటి రాజేంద్రనాథరెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సామాజికతనిఖీ ఓపెన్ ఫోరం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌లేని కూలీలకు జాబ్‌కార్డులు కల్పించి, సకాలంలో పనులు కల్పించాలన్నారు. కూలికి గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలన్నారు. రైతులకు పండ్ల మొక్కలు సాగు తదితరం వాటిపై ఉపాధి హామీ పథకం ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. డ్వామా పీడీ మద్దిలేటి మాట్లాడుతూ సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లోకి వెళ్లి కూలీలను విచారించి పనుల వద్దకు వెళ్లి పరిశీలించారన్నారు. రూ.8కోట్ల పనులు కల్పించడం సంతోషదాయకమన్నారు. హౌసింగ్, సచివాలయాలు, సీసీరోడ్లు, ఉపాధి హామీలో చేపట్టామన్నారు. ఈ పనులలో సోషల్ ఆడిట్ బృందం పదిరోజులుగా గ్రామాలలో తిరిగి పనులు పరిశీలించారు. సభకు ఎంపీపీడీఓ మల్లీశ్వరీ, ఏపీడీలు ప్రతాప్‌స్వామి, రెడ్డయ్య నాయుడు, అంబుడ్స్‌మెన్ శివప్రకాశ్, డీవీవో ప్రకాశ్, ఏపీఓ నాగరాజు, ఈసీ సూర్యకుమార్‌రెడ్డి,ఎస్ఆర్పీ చంద్రమోహన్, సోషల్ ఆడిట్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'ఓటరు సవరణ'ను సద్వినియోగం చేసుకోవాలి

పుల్లంపేట : మండల పరిధిలో శని, ఆది వారాలలో నిర్వహించనున్న ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ నరసింహకుమార్ తెలిపారు. శనివారం ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట గ్రామంలోని బూత్ సెంటర్ 97ను పరిశీలించి పలు రాజకీయ పార్టీ నాయకులకు, బీఎల్ఓలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలోని ప్రతి పోలింగ్ బూత్ వద్ద ఈ శిబిరాలను ఏర్పాటు చేశామని, ఈ మంచి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ మల్లికార్జున, బీఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు నమోదు చేసుకోండి

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయతీ పరిధిలోని 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు డిసెంబర్ 9వ తేదీలోపు ఆయా గ్రామాల పరిధిలోని బీఎల్ఓల కేంద్రాల వద్ద ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ అరవిందకిశోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పొత్తుకూరుపల్లి బూత్ నెంబర్ 55, కుమ్మరపల్లి బూత్ నెంబర్ 56, కల్పనాయునిచెరువు బూత్ నెంబర్42, చిట్లూరు బూత్‌నెంబర్ 46, 47 పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు నమోదు కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు అందజేశారు.

భూములు ఆక్రమిస్తే సహించేది లేదు



పార్కుస్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ తదితరులు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని తహసీల్దార్ ప్రేమంత కుమార్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ హెచ్చరించారు. శనివారం వారు వివిధ ప్రభుత్వ స్థలాల్లో చేపట్టనున్న పార్కులు, షాపింగ్ కాంప్లెక్స్ కోసం చేస్తున్న చదును పనులను మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, సర్వే, పట్టణ ప్రణాళికా విభాగాలకు చెందిన అధికారులతో కలసి పరిశీలించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే నంబరు 604,610లో ఆక్రమణలను తొలగించినట్లు తెలిపారు.

ముమ్మరంగా నాకాబందీ



రాజంపేట: నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

రాజంపేట : రాజంపేట పరిసర ప్రాంతాల్లో పోలీసులు శనివారం నాకాబందీ నిర్వహించారు. సీఐలు మద్దయ్య ఆచారి, మంజునాథ రెడ్డి నేతృత్వంలో ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, భక్తవత్సలం ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నాకాబందీని పకడ్బందీగా కొనసాగించారు. అసాంఘిక శక్తులు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.

కోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని పలు గ్రామాలలో రాజంపేట డీఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ మధుసూదన రెడ్డి తన సిబ్బందితో కలిసి శనివారం నాకాబందీ నిర్వహించి తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజామున కోడూరు మండలంలోని ఉప్పరపల్లి, హరిజనవాడ గ్రామాలలో తనిఖీలు చేపట్టారు. అలాగే రికార్డులు లేని పది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కోడూరు, చిట్వేలి ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.



కోడూరులో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ

'ఆడుదాం ఆంధ్ర'కు రిజిస్ట్రేషన్ చేయించుకోండి



తహశీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న వత్తలూరు సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : ఆడుదాం ఆంధ్రాకు ఆసక్తిగల క్రీడాకారులు తమ సచివాలయాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి కోరారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ విజయారావులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర లో భాగంగా డిసెంబర్ 15వ తేది నుంచి జనవరి 15వ తేది వరకు క్రీడా పోటీలు నిర్వహించనున్నారని అన్నారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలకుగాను క్రీడాకారులు రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని కోరారు. అదే విధంగా ఓటర్లు తమ ఓటును పరిశీలించుకోవాలని లేనిచో వెంటనే ఓటు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని భూ సమస్యలు తదితర అంశాలపై తహశీల్దార్ ఎంపీడీఓతో చర్చించారు.

వండాడి, పడమటికోన గ్రామాల సందర్శన



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్

చిన్నమండెం : మండల పరిధిలోని వండాడి, పడమటికోన రెవెన్యూ గ్రామాలను జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించారని తెలిపారు. ఈ నెల 7వ తేదీన కరువు బృందం పర్యటించే అవకాశం ఉందన్నారు. కరువు అంచనా వేసేందుకు ఖరీఫ్ పంటలు కోత కోస్తారు కాబట్టి పైరు ఎండిపోయిన ఫోటోలతో ఫోటో ఎగ్జిబిషన్ పెట్టాలన్నారు. కరువు బృందం వచ్చినపుడు రైతులు తప్పకుండా రావాలన్నారు. రాయచోటి ఇన్‌చార్జ్ ఏడీఏ ఉమాపతి, ఏఓ గీత, ఆర్బీకే సిబ్బంది రేణుక, బాలాజీ, రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం పనుల పరిశీలన



రాయచోటిలో నిర్మాణ దశలో ఉన్న క్రికెట్ స్టేడియం పనులను పరిశీలిస్తున్న ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో శరవేగంగా రూపుదిద్దుకుంటున్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను శనివారం ఎంపీ మిథున్ రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయచోటి మండలం, దిగువ అబ్బవరం గ్రామ పంచాయతీ, నక్కలవాండ్లపల్లి వద్ద నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియంపనులను అధికారులందరూ సమన్వయంతో పనిచేసి వెంటనే పూర్తి చేయాలన్నారు. స్టేడియానికి వచ్చే రహదారికి ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనం వెల్లి విరిసేలా మొక్కలు పెంచాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పనుల పురోగతిపై రెవెన్యూ, ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్రికెట్ స్టేడియం మొత్తం కలియతిరిగి పరిశీలించారు. అనంతరం డైట్ హాస్టల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ పార్కును వారు సందర్శించారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, కమీషనర్ రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య కార్డుల పంపిణీ వేగవంతం



పొందలూరులో పశు ఆరోగ్య కార్డులను పంపిణీ చేస్తున్న డీడీ భాస్కర్

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పశు ఆరోగ్య కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పశు సంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ అన్నారు. శనివారం పెనగలూరు మండలంలోని ఓబిలి, పొందలూరు గ్రామాలలో కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో యథావిధిగా పశు ఆరోగ్య కార్డులు కొనసాగించాలన్నారు. పశువుల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలన్నారు సిబ్బంది కార్డుల పంపిణీని కొనసాగించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాకర్లవారిపల్లె పశువైద్యులు వేదవతి, జూనియర్ వెటర్నరీ అధికారి పుల్లయ్య, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

అభయహస్త ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



15 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్టించిన దృశ్యం



మహా యజ్ఞాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

సంబేపల్లి : శ్రీ అభయహస్త ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లి పంచాయతీ, తిరుమలరాయగుట్టపై శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో శనివారం 15 అడుగుల అభయ హస్త ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వేదపండితులచే ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. టీటీడీ వారి సౌజన్యంతో హనుమాన్ చాలీసా పారాయణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ఉపాధి నైపుణ్యంపై రెండు రోజుల వర్క్‌షాప్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో ఉపాధి నైపుణ్యాలపై 4, 5 తేదీలలో జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కన్వీనర్ డా. కె. లలిత, కో కన్వీనర్ డా. వి. లాజరస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. సరిత, డా. కె. రియాజున్నీసా, డా. సునీత ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, వ్యాపార, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ప్రాజెక్టు తయారీ, డిజిటల్ ఖాతాల నిర్వహణ, నూతన వ్యాపార సంస్థల ఏర్పాటు తదితర అంశాలపై వర్క్‌షాప్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



చిన్నమండెం: అయ్యప్ప స్వామి గ్రామోత్సవం





రాయచోటి టౌన్: అంబులం పూజలో పాల్గొన్న దీక్ష ధారులు స్వామికి పూజలు నిర్వహిస్తున్న గురుస్వాములు

చిన్నమండెం : మండల కేంద్రంలోని బలిజపల్లెలో శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వాములు అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గురు స్వాముల భక్తిపాటలతో తన్మయత్వంలో మునిగిపోయారు. గ్రామోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు భక్తిపరవశంలో పరవశించిపోయారు. స్వామి వారి గ్రామోత్సవం బస్టాండు వరకు నిర్వహ/ంచారు. వందలాది మ ంది అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా అంబలం పూజ

రాయచోటిటౌన్ : కార్తీక మాసాలలో అయ్యప్ప స్వామి దీక్షలు చేపట్టిన అయ్యప్ప స్వాములు స్వామికి ఇష్టమైన అంబులం పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి రాయచోటి పట్టణ పరిధిలోని సుద్దలవాండ్లపల్లె రోడ్డులో ఎత్తైన గుట్టపై వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ ధర్మ కర్త గురుస్వామి బసిరెడ్డి స్వామి వారి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ పూజలు సురేష్‌రెడ్డి, సాయి కుమార్ యాదవ్, గంగిరెడ్డి స్వామి సహకారంతో నిర్వహించారు. ఈ పూలలో పాల్గొన్న అయ్యప్ప స్వాములకు, పూజకు హాజరైన భక్తులకు అన్నప్రసాదం అందించారు.

మంగంపేటలో అయ్యప్ప పడిపూజ

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లి గ్రామంలో రైల్వేకోడూరు డీఆర్‌యుసీసీ మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి శనివారం రాత్రి అయ్యప్ప పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని నలుమూలల నుంచి అయ్యప్పమాలధార స్వాములు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు.